# 25. వైద్య మర్మం

అప్పట్లో జగదాంబకి గత జన్మ ఫలాల మీద గాఢ విశ్వాసం ఉండేది. ఎన్ని పుణ్యకార్యాలు చేస్తే ఇంత అందమైన శరీరం లభిస్తుంది! ఎంత గొప్ప తపస్సు చేసి ఉండకపోతే అనాథగా పుట్టిన తనను అష్టైశ్వర్యాలు గల ఓ దూరపు బంధువు పెంచుకుంటాడు! ఏనాడో బస్తాల కొద్దీ బంగారు పువ్వుల పూజ చెయ్యబట్టి కదా, పెళ్ళాన్ని నెత్తిమీద పెట్టుకునే కోటీశ్వరుడు భర్తగా లభించాడు! ఇక హైస్కూలు చదువయినా అంతగా వంటబట్టలేదని ఎవరేమనుకుంటే తనకేం. పత్రికల బొమ్మలు అటూ ఇటూ తిప్పగల సమర్థత ఉండగా! అటు తీసిన వస్తువు ఇటు పెట్టదని అసూయపరులు ఆడిపోసుకుంటే ఏమైంది, ఆడపిల్లల పెళ్ళిళ్ళు, మగపిల్లల ఉద్యోగాలూ, ఇంతటి ఇంటి నిర్వహణా తన ప్రమేయమూ, ప్రయోజకత్వమూ లేకుండానే జరిగాయి!

జగదాంబ ఒకప్పుడు దేశంలోని సమస్త పుణ్యక్షేత్రాలూ దర్శించి వచ్చేది. ఆ తర్వాత అంత ఓపికలేక, ఊళ్ళో ఉన్న గుళ్ళన్నీ చుట్టి వచ్చేది. అదీ సడలి ఉత్సవ విగ్రహాల పల్లకీ వీధి గుమ్మంలో దిగితే ఓ నమస్కారంతో సరిపెట్టుకునేది. ఇక తనింటి పూజాగృహంలోనే చతికిలపడేది. చివరికి పడకగదిలో డన్‌లప్ బెడ్ మీదే ధ్యానం చేసుకునే స్టేజికి చేరుకుంది. 'మనసే కదా ముఖ్యం' అని ఎంత సరిపెట్టుకుందామనుకున్నా శరీరానికేదీ సౌఖ్యం? అనే నిత్యవేదనలో ఎక్కడెక్కడి కర్మ సిద్ధాంతాలూ గాలికి కొట్టుకుపోయేవి. గత జన్మలో ఎన్నో పుణ్యకార్యాలు చేసి ఈ అయిదోతనం ఐశ్వర్యం పొందగలిగింది తను, మరి ఈ చివరి కాలంలో ఈ అనారోగ్యం ఏమిటి! ఇది తనలాంటి ఉత్తమురాలి గత జన్మ పాపఫలమే అంటే ఎలా నమ్మడం!

రోజురోజుకీ విజృంభించే ఈ అనారోగ్యపు ధాటికి తట్టుకోలేక ఈ అయిదారేళ్ళ నుంచీ జగదాంబ మనసు గిలగిలా కొట్టుకుపోతోంది. 'నా బాధ పట్టించుకునే నాథుడెవడూ లేడు' అనే భావన కలలో అయినా కలగకుండా ఆమెకు తోడూ నీడగా కంటికి రెప్పలా ఇరవైనాలుగు గంటలూ పత్నీసేవలోనే నిమగ్నుడై ఉంటాడు భర్త సుబ్రహ్మణ్యం. ఈ చరమకాలంలో ఈ పరమ దౌర్భాగ్యం ఏమిటని ఎవరైనా ఆయన్ని చూసి జాలిపడాలేమో గాని తనని చూసి జాలిపడే కోరికగాని తీరిక గాని ఆ సెకండరీ సఫరర్‌కి మాట వరసకైనా లేదు. పెద్దయిల్లూ, దానికి ప్రత్యేకించి పనివాళ్ళూ. కాలు కదపనక్కర్లేకుండా లభ్యమయ్యే ఆధునిక పరికరాలూ. వచ్చి సేవలందించకపోయినా అట్నించిటు తల్లిదండ్రుల్నించి ఎన్నో ఆశించే స్వార్థపు సంతానం కాదు. వృద్ధుల్ని వారి మటుకు వార్ని బ్రతకనిచ్చే అరుదైన సంతానం వారిది.

ఆకలేసి ఏ పూటకాపూట ఆవురావురుమని అన్నీ ఆరగిస్తుంది గాని, ఏ మాత్రం అరిగినట్టుండదు జగదాంబకి! ఇలా పడుకున్న మనిషి అలా నిద్రలోకి జారి గంటలకి గంటలు గుర్రుపెట్టి నిద్రపోతుంది గానీ, ఏ కొంచెం విశ్రాంతి చిక్కినట్టుండదు! పైకి పూలరథంలా కనిపించ

వచ్చు గాని లేతచివురులా చూసుకునే మొగుడున్నా హోరుగాలిలో పండుటాకులా దడదడ కొట్టుకుపోతుంది ఆమె గుండె.

సుబ్రహ్మణ్యం కాలకృత్యాలు తీర్చుకునేటప్పుడో, స్నానం చెయ్యడానికి వెళ్ళినప్పుడో, పెన్షన్ డ్రా చెయ్యడానికి కారు మీద బ్యాంకుకి అలా వెళ్ళి ఇలా వచ్చే సమయంలోనో జగదాంబని ఒంటరిగా వదిలి వెళ్ళడానికే అతని మనసు ఒప్పుకోదు. ఎంతెంత జీతాలిచ్చి పెట్టినా పనివాళ్ళు పై వాళ్ళే కదా. వరసకి చెల్లెలైనా నరసమ్మ అనే ఓ దిక్కూ దివాణం లేని దాన్ని తెచ్చి ఇంట్లో భార్యకు తోడుగా ఉంచుకున్నాడు గాని, ఆమెకేం పని చెప్పడు! నిత్యం ఆమె వేదనతో పాలు పంచుకోవాలనుకునే సహధర్మచారుడు సుబ్రహ్మణ్యం. ఎక్కువగా తమ బాధల గురించి చెప్పుకునే వాళ్ళకి కేవలం వినేవాళ్ళ మీదనే తప్ప తమ మాటలతో ఎదుర్కొనే వాళ్ళంటే ఇష్టముండదు. అందుకనే వినడమే తప్ప నోటితో ఏ మాటా చెప్పలేని మూగప్రాణి నరసమ్మ జగదాంబ ఎమర్జెన్సీ సేవకి అన్నివిధాలా నప్పింది. 'ప్రాణం పోతున్నా అలా పంటిబిగువున చిక్కపట్టి భరించడమే గాని ఇంకొకరి చెవిన వెయ్యడం నాకు సుతరామూ ఇష్టముండదు' అనే ఉపోద్ఘాతంతో గాని వదిన మొదలెట్టిందంటే నరసమ్మకి కళ్ళూ, తలా ఊపడం తప్ప మార్గంలేదు. తను మూగదని ముందుగా తెలిసినా కట్నంగా ఇచ్చిన అయిదెకరాల పొలానికి ఆశపడి చేసుకున్న మొగుడు గాడిద తన సహజగుణం కాదనలేక తన్ని తగలేశాడు. అన్న తీసుకొచ్చి అన్నం, గుడ్డా ఇచ్చి ఆశ్రయం కల్పించాడు. 'ఇంతటి భద్రతతో పోలిస్తే వదిన వినిపించే సొద చెవులారా వినగలగడం ఏమంత ఇబ్బంది!' అనుకొని శ్రోత స్థానాన్ని అంకిత భావంతో అమలు పరుస్తుంది నరసమ్మ. అయితే, జగదాంబ పలు రకాల బాధామయ ప్రభంజనం పరవళ్ళు తొక్కుతూ బయటపడిపోతుంటూంది.

"ఉన్నట్టుండి నాడి అందదు, గుండె దడదడ దడదడా కొట్టుకుపోతుంది. నోట్లో ఒక్క చుక్కంటే ఒక్క చుక్క తడి ఉండదు. ఒంట్లో ప్రవహించేది రక్తమో, నీరో తెలియనంతగా నిలువెల్లా పాలిపోతుంది. కళ్ళు గిరగిర తిరుగుతున్నట్టనిపిస్తుంది. నిలుచుంటే పడిపోతానేమో అని బెంగ. పడుకుంటే మరి లేవలేనేమో అనే చింత. మాటిమాటికి ముఖం తిరిగి పడిపోతానేమో అనే ఆదుర్దా. ఆందోళనతో ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయిపోవడం. ఇంతెత్తున ఎగిరిపడేసే ఆయాసం. ఇన్నివిధాల కృంగి కృశించిపోతున్నా ఒక్క ముక్క పైకి చెప్పుకోని వల్లమాలిన మానుషం మాటో?" ఎవరూ లేని దానిగా పుట్టినా మనసూ మనీ మస్తుగా ఉన్నవాళ్ళతోనే జగదాంబ జీవితమంతా గడిచింది. ఏ కారణం వల్లనైతేనేం ఆవిడప్పుడు నానా బాధపడుతోంది. ఎన్నిరకాల మందులు వేసుకున్నా ఏ మాత్రం స్వాంతన చిక్కక అల్లల్లాడిపోతోంది. కట్టుకున్న భార్య ఇలా ఈ వయసులో కొట్టుమిట్టాడుతుంటే పట్టీపట్టనట్టు ఊరుకోవడం సుబ్రహ్మణ్యం లాంటి సహృదయుడి తరం కాదు. ఆమె ఆరోగ్యం కుదుటపరిచే ప్రయత్నాలన్నీ చేశాడు. పాపం ఏ భాగంలో ఏ దోషముందో అని శరీరంలోని ముఖ్యభాగాలన్నింటికీ ఒకటొకటిగా స్కానింగు చేయించాడు. ఖర్చూ, శ్రమా అనేవి

చూసుకోకుండా ఏ పెద్ద నగరంలో ఏ కొత్త పరీక్ష ఉందంటే అక్కడికి భార్యని తీసుకెళ్ళి ఆ అధునాతన పరిశోధనకి అవకాశం కల్పించాడు. అంతకు ముందే తిరిగొచ్చారు గనుకనూ, అడుగు తీసి అడుగు వెయ్యలేని ఓపిక జగదాంబలో సన్నగిల్లడం చేతనూ గుళ్ళూ, గోపురాలూ మాట అలా ఉంచి, మొక్కుబడులూ, బాబా దర్శనాలూ ఏనాడో విసుగెత్తి ప్రక్కకి పెట్టేశారు. ఇక ఆవిడ అంతో ఇంతో విశ్వాసముంచింది ఇంగ్లీషు వైద్యం ఒక్కదాని మీదే. ఇంజక్షన్లంటే మొదట్నుంచీ భయం కనుక అవి లేవు గాని టాబ్లెట్లతో, టానిక్కులతో ఆవిడ బెడ్‌రూంలో సగం మందుల షాపులాగే ఉంటుంది. పూర్వం రాజుగారి రాచపుండుకి పులిపాలో మరేదో నివారణ అంటూ ఉండేది. ఏది తెప్పించడానికైనా విసుగు చెందని విక్రమార్కుడులాంటి సుబ్రహ్మణ్యం ఎప్పుడూ సిద్ధమే గాని, వ్యాధి మూలం ఏదో తెలియాలి కదా!

అందుకనే మరింత పట్టుదలతో మరిన్ని స్కాన్లు చేయించాడు. ఏ భాగంలో లోపమైనా పట్టియిచ్చే సి.టి.స్కాన్ చేయించాడు. అక్కడా ఏం దొరకకపోతే మేగ్నెటిక్ రెజొనెంట్ ఇమేజ్, ఎం.ఆర్.ఐ. చేయించాడు. ఎండోస్కోప్, ఏంజియోగ్రాఫీ సరేసరి. ఓవేళ మూత్రనాళంలో రాళ్ళు చేరి ఇంత సతమతమవుతుందేమోనని అల్ట్రా సోనోగ్రఫీ చేయించాడు. ఓ అనుభవం ఉన్న పెద్ద డాక్టర్ "ఓవేళ 'డ్రగ్ ఆటోమేటిజమ్' లాంటిది ఏర్పడి ఆత్మహత్యకు దారితీస్తుందేమో సుమా అని హెచ్చరిస్తే అది కాదని రుజువయ్యే దాకా సుబ్రహ్మణ్యం అన్నహారాలు ముట్టలేదు. పోనీ ఏ బ్రెయిన్ ట్యూమరో అనుకుంటే పేషెంటు ప్రకటించే లక్షణాలు తప్ప ఏ ఒక్క పరికరం గానీ, పరీక్ష గానీ ఏ చిన్న తప్పూ ఎత్తి చూపదే!

అప్పుడప్పుడూ తల్లిని చూడడానికి వచ్చిన పిల్లలు మాత్రం ఏం తెలుసుకున్నారో ఏమో వారం రోజులు ఉండాలనుకున్న వాళ్ళు మూడు రోజులకే మొహం తిరిగి వెళ్ళిపోయేవారు. తండ్రంటే ప్రాణం పెట్టే పెద్దకూతురు మాత్రం హెచ్చరించేది. 'అమ్మమాటకేం, ఏం రోగమో ఏమో గాని గుమ్మటంలా ఉంది. నువ్వేం బెంగపెట్టుకున్నావో మరి, ఉఫ్ అంటే ఎగిరిపోయేలా తయారయ్యావ్. తీసిన కొద్దీ ఇలాంటి రోగాలు గొయ్యిలా పెరుగుతాయి. అన్ని సదుపాయాలూ ఉన్న ఏదో ఒక నర్సింగ్‌హోమ్‌లో అమ్మని చేర్పించి నువ్వేదైనా హెల్త్ రిసార్ట్‌కి వెళ్ళి రెస్టు తీసుకో. నువ్వు తప్పుకుంటే గాని ఆవిడ రోగం కుదరదు' పెద్దమ్మాయిని కొట్టినంత పనిచేసి, ఆ రాత్రే రైలెక్కించేశాడు, సుబ్రహ్మణ్యం.

జగదాంబ పడే బాధను ఎన్నేళ్ళు గడిచినా ఎంతో సానుభూతితో అర్థం చేసుకొని సహకరించే సుబ్రహ్మణ్యం, ఏదైనా పైకి కక్కలేని నరసమ్మా వాళ్ళిద్దరే ఆవిడకి నిజాయితీగా సేవ చేసేవారు. ఇక ఇంట్లో ఉండే పనివాళ్ళకి సైతం ఆవిడ రోగం అదో వేళాకోళంగా మారిపోయింది. ఆ విమర్శ ఆ నోటా, ఈ నోటా చెవిన పడి ఆవిడ మరింత క్రుంగిపోయేది. 'మెంటల్ కేసయితే పిచ్చాసుపత్రిలో చేరాలి. అంతేగాని ఏదో ఒక రోగం అంటూ ముప్పొద్దులా పీకల మొయ్యా వాయించి మూలుగుతూ

కూచుంటే పిచ్చి వెధవలా యేం, విన్నవాళ్ళు నమ్మడానికి?' అని దగ్గర బంధువులొకరు ఆవిడకి స్పష్టంగా వినపడేలా అననే అన్నారు! ఇలాంటి మాట విని 'ఇంకా ఎందుకు బతుకుతున్నానా!' అని ఆవిడ అంతులేని మానసిక వేదనకి గురయింది. "ఇంతగా నేను బాధపడుతున్నందుకు కనీసం ఈ వ్యాధి పేరైనా చెప్పలేకపోయారు. ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పుకుంటారే ఈ వైద్యశాస్త్ర ప్రగతి, ఎందుకు కాల్చనా! రెండ్రోజుల్లో నా రోగం పేరేమిటో కనుక్కుని వచ్చిచెప్పకపోయారో నేను అన్నం, నీరు ముట్టను" అని భర్త ముందు ప్రతిజ్ఞ చేసింది జగదాంబ.

సుబ్రహ్మణ్యానికి నోటమాట రాలేదు. ఆవిడా తర్వాత ఏం చేసేదో గాని ఆ క్షణం నుంచే అతనికి అన్నం ముద్ద దిగలేదు. అదృష్టవశాత్తూ చిన్ననాటి ఫ్రెండొకడు, సైకియాట్రిస్ట్, ఫారిన్ రిటర్న్డ్ ఏదో కాన్ఫరెన్స్‌కి ఆ ఊరొస్తే అతన్ని పట్టుకున్నాడు. అతను ఆ మర్నాడే వాళ్ళింటి కొచ్చి ఆవిణ్ణి పరీక్షించి ఇలా అన్నాడు.

"చూడమ్మా! పైకలా పొట్లపండులా కనిపిస్తున్నారు గానీ, లోపల్లోపల ఏ భాగానికా భాగం విడిపోయి, తెగిపోయి ఉంది! ఇన్నిన్ని బాధలు ఎంతో సహనంతో భరిస్తూ ఎంతో మనోధైర్యంతో ఇలా ఉన్నారంటే మీ ఓర్పుకి జోహార్లు. పామరులు, పై వాళ్ళకేం తెలుస్తుంది. అణువణువునా కోత పెట్టే మీ ఆవేదన! ఇలాంటి అరుదైన వ్యాధుల్ని పోల్చే స్థాయికి వైద్యశాస్త్రం ఎదగలేదమ్మా! దీని పేరేమిటో తెలుసా, హైపోకాండ్రియా."

ఆ పేరు వినగానే జగదాంబ కళ్ళు మిలమిలా మెరిశాయి.

ఇన్నాళ్ళకి తన రోగానికి ఓ పేరుందని తెలిసిన జగదాంబ మనసు ఎంతగానో పొంగిపోయింది. "మీరే గుర్తుంచుకోండి గానీ ఈ పేరు ఎవరికీ చెప్పకండి. 'ఫార్మికోమానియా' అనేది దీని లక్షణం. దీనికి 'ప్లాసిబో' అని ఒకే మందుంది. చాలా పెద్ద డోసుల్లో పడాలి. పంపిస్తాను" అని చెప్పి వెళ్ళి పోయాడు. ఇంతకీ ఏ రోగమూ లేకపోయినా ఏదో రోగమున్నట్టు బాధపడడానికి "హైపోకాండ్రియా" అంటారనీ, ఏదో మందు ఎప్పుడూ వేసుకునే పిచ్చికి "ఫార్మికోమానియా" అంటారనీ, "ప్లాసిబో" అనేవి ఏ ఔషధ గుణం లేని దొంగమాత్రలని జగదాంబలాంటి వాళ్ళకి తెలిసే అవకాశం ఈ జన్మకి మాత్రం లేదు!

★